

భగీరథ.. బడికి వ్యథ!

ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీటిని అందించాలని గత ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. 8లో▸



రికార్డులు సృష్టించి..

ఉపాధి పథకం అక్రమార్జనకు దిక్సూచిగా మారింది. సిబ్బంది రాసిందే శాసనం.. అనే రీతిలో చేతివాటం చూపిస్తున్నారు. 8లో▸



సమస్యలు పరిష్కరిస్తాం

మెడికల్ కాలేజీ హాస్టల్‌లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

సర్టిఫికెట్ల పరిశీలనకు మరో అవకాశం

వికారాబాద్ అర్బన్: రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాల్లో డీఈఈ సెట్ 2023 –25 రెండు సంవత్సరాల కోర్సులో చేరడానికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కాని వారి కోసం ఈ నెల 14న మరోసారి అవకాశం కల్పించినట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ ప్రభుత్వ డైట్ కళాశాలలో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. 22న సీట్ల కేటాయింపు, 23నుంచి 26వ తేదీ వరకు ఫీజు చెల్లించి అలాట్‌మెంట్ లెటర్ పొందవచ్చని సూచించారు. ఎంపికైన కళాశాలలో ఒరిజినల్ ధ్రువపత్రాలను సమర్పించి 28వ తేదీలోగా జాయిన్ కావాలని సూచించారు.

పీవీకి భారతరత్న హర్షణీయం

అనంతగిరి: దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహరావుకు భారతరత్న ప్రకటించడం హర్షణీయమని ప్రముఖ కవి రాజలింగం శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఆయన దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. భారత రత్నతో పీవీని గౌరవించడం సంతోషంగా ఉందన్నారు. బాబు జగ్జీవన్‌రామ్‌కు కూడా భారతరత్న ప్రకటించాలని ఆయన కోరారు.

గ్రామాల అభివృద్ధి భేష్

పులుమద్ది గ్రామాన్ని సందర్శించిన ఎన్ఐఆర్డీ శిక్షణ బృందం



పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించిన శిక్షణ అధికారులు

అనంతగిరి: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్డీ)లో శిక్షణ పొందుతున్న వివిధ రాష్ట్రాలకు చెందిన బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారులు, పంచాయతీ ఎక్స్‌టెన్షన్ అధికారులు,కార్యదర్శులు శనివారం వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామాన్ని సందర్శించారు.పంచాయతీ పరిధిలో చేపట్టిన పనులను పరిశీలించారు.కంపోస్టు షెడ్, పల్లె ప్రకృతి వనం, తెలంగాణ క్రీడా మైదానం, బృహత్ పల్లె ప్రకృతి వనం, శ్మశానవాటిక, ఎవెన్యూ ప్లాంటేషన్, గ్రామ పంచాయతీ పనితీరు, రికార్డుల నిర్వహణ వంటి వాటిని పరిశీలించారు.పంచాయతీ తరఫున చేపడుతున్న పనులు,కార్యాలయం విధులు,ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగ రాజు, ఏపీఓ శ్రీను పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతన కమిటీని ప్రకటిస్తున్న మాధవరెడ్డి తదితరులు

అనంతగిరి: బీజేపీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోకట్ మాధవరెడ్డి శనివారం వికారాబాద్‌లో ప్రకటించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా విజయభాస్కర్ రెడ్డి(వికారాబాద్), కృష్ణ ముదిరాజు(తాండూరు), రాంచందర్(పరిగి), ఉపాధ్యక్షులుగా అంతారం లలిత(తాండూరు), రాజేందర్‌రెడ్డి(వికారాబాద్), రాము యాదవ్(పరిగి), కేశవులు(దోమ), బాలి శివకుమార్(తాండూరు), సి.రాములు(వికారాబాద్), శ్రీధర్‌రెడ్డి(వికారాబాద్), కార్యదర్శులుగా విజయ్‌రాజు(వికారాబాద్), సారా జగన్(నవాబుపేట), మల్లేష్ యాదవ్(మర్పల్లి), రాకేష్(కొడంగల్), భద్రేశ్వర్(తాండూరు), బుస్స శ్రీకాంత్(వికారాబాద్), పెంటయ్యగుప్తా(పరిగి), కోశాధికారిగా పోకల సతీష్, జిల్లా కార్యాలయ కార్యదర్శిగా యాదగిరి(వికారాబాద్), జిల్లా అధికార ప్రతినిధులుగా జుంటుపల్లి వెంకట్, ఐనాపురం యాదయ్య(పరిగి)ని ప్రకటించారు. యువ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా చిట్యాల చరణ్‌రెడ్డి(వికారాబాద్), మహిళా మోర్చా అధ్యక్షురాలిగా యాస్కి శిరీష (వికారాబాద్), కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా సంజీవరెడ్డి(తాండూరు), ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా గాలయ్య(నవాబుపేట), బీసీ మోర్చా అధ్యక్షుడిగా బొప్పి శ్రీహరి(తాండూరు), ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా గోవింద్‌నాయక్(పరిగి), మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా జకీర్ జహీర్ అబ్బాస్(తాండూరు)ను నియమించినట్లు మాధవరెడ్డి తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, నాయకులు కేపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

షరా మామూలే..!

బడ్జెట్‌పై నేతల మిశ్రమ స్పందన

- తెరపైకి 'ప్రాణహిత – చేవెళ్ల'
- కానరాని పాలమూరు ఎత్తిపోతల ప్రస్తావన
- ఇందిరమ్మ ఇళ్లకు మోక్షం
- జిల్లాలో 1.40 లక్షల మంది గృహజ్యోతి లబ్ధిదారులు
- గురుకుల భవన నిర్మాణాలకు నిధులు
- ఈ సారి రైతు రుణమాఫీ లేనట్టే



వికారాబాద్: తెలంగాణ ఏర్పడిన తరువాత తొలిసారి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు ఉంటాయని భావించినా నిరుత్సాహమే ఎదురైంది. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ సొంత జిల్లా అయినా పద్దులో ప్రత్యేక కేటాయింపులు ఎక్కడా కనిపించలేదు. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 2,75,891 కోట్లతో శనివారం ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టారు. రైతులకు ఊహించిన స్థాయిలో కేటాయింపులు జరగలేదు. రూ.2 లక్షల రైతు రుణమాఫీ ప్రస్తావన వచ్చినా ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. రుణమాఫీ అమలు చేస్తే జిల్లాలో 1.7 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరే అవకాశం ఉండేది. ఎప్పటిలాగే వ్యవసాయ యంత్రీకరణకు మొండి చేయి చూపించింది. ప్రస్తుత బడ్జెట్‌పై ప్రతిపక్షాలు మాత్రం అంకెల గారడీ తప్పా ప్రజలకు ఒరిగేదీమీ లేదని కొట్టిపడేస్తున్నాయి. సంక్షేమం, అభివృద్ధికి భారీ కేటాయింపులు చేశారు. కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పేరుతో ఇప్పటికే ఐదారు వందల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. కానీ కేటాయింపుల్లో ఆ ప్రస్తావన కనిపించలేదు.

సంక్షేమానికి పెద్దపీట

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి భారీగా నిధులు కేటాయించారు. ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించారు. ఈ లెక్కన జిల్లాకు 14వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయి. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున, జిల్లాకు రూ. 700 కోట్ల నిధులు రానున్నాయి. అర్హులైన వారందరికీ గృహజ్యోతి పథకం వర్తింపజేస్తామని చెప్పడంతోపాటు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. దీంతో జిల్లాలో 2.40 లక్షల డొమెస్టిక్ కనెక్షన్లు ఉండగా ఇందులో తెల్లరేషన్ కార్డు కలిగి 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే లబ్ధిదారులు 1.30 లక్షల మంది ఉండే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో సగం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. అంగన్‌వాడీ కేంద్రాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించిన నేపథ్యంలో వాటికి సొంత భవనాలు సమకూరే అవకాశం ఉంది. జిల్లాలో 22 గురుకుల పాఠశాలలు సొంత భవనాలు లేకపోవడంతో నిధులు కేటాయించారు. బీసీ సంక్షేమానికి నిధుల కేటాయింపు తగ్గిన నేపథ్యంలో ఆ సంఘాల నేతల పెదవి విరుస్తున్నారు.

అనంతగిరికి రిక్త హస్తమే..

జిల్లాలోని ప్రసిద్ధి చెందిన అనంత పద్మనాభస్వామి ఆలయ కొండల్లోనే మూసీ నది ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతం పర్యాటకంగానే కాకుండా ఆధ్యాత్మిక పరంగా కూడా ఎంతో ప్రసిద్ధి. ఈ ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని పలుమార్లు హామీ ఇచ్చారు. దేశీ దర్శన్ పథకం కింద అనంతగిరిని కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని పేర్కొంది. కానీ బడ్జెట్‌లో అనంతగిరికి ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. అనంతగిరికి పైసా కూడా విదల్చలేదు.

పాలమూరు పక్కకు..

జిల్లా సాగునీటి వరప్రదాయినిగా భావించే పాలమూరు ఎత్తిపోతల పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. రంగారెడ్డి – పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రస్తావన కూడా లేదు. అయితే దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. జిల్లాలోని కోట్‌పల్లి ప్రాజెక్టు, కాలువల మరమ్మతుల కోసం రూ. 38 కోట్లతో ప్రతిపాదనలు పంపగా కేటాయింపులు లేవు. జుంటుపల్లి, లఖ్నాపూర్, సర్పన్‌పల్లి తదితర ప్రాజెక్టుల కాలువల మరమ్మతులకు ఎలాంటి కేటాయింపులు చేయలేదు.

బడ్జెట్ బ్రహ్మాండం



గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ బడ్జెట్ ఉంది. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం శుభపరిణామం. బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు, రంగాలకు ప్రాధాన్యత ఇచ్చింది. వ్యవసాయం, సంక్షేమం, ఇందిరమ్మ ఇళ్లు పెద్దపీట వేసింది. గృహజ్యోతి పథకానికి నిధులు కేటాయించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు, గురుకులాలకు భవనాలు నిర్మించనున్నారు.

– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

అంకెల గారడీ



కాంగ్రెస్ ప్రభుత్వం అంకెల గారడీ చేసింది. వాస్తవంలో ఖర్చు కనిపించడం లేదు. హామీలు, ఆరు గ్యారంటీల్లో సగానికి పైగా బడ్జెట్‌లో ఊసేలేదు. పాలమూరు ఎత్తిపోతలకు ప్రత్యేక నిధులు లేవు. అబద్ధపు హామీలకు కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రత్యేక నిధులు రాబట్టడంలో జిల్లా నేతలు విఫలం అయ్యారు.

– ఆనంద్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు

చాలా బాగుంది



గత ప్రభుత్వంతో పోలిస్తే ఈ ప్రభుత్వానికి పేదల సంక్షేమంపై ఉన్న చిత్తశుద్ధి ఏంటో కేటాయింపుల్లో క్లియర్‌గా కనిపిస్తోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా అ ద్భుతంగా ఈ బడ్జెట్ ఉంది. ఆరు గ్యారంటీలకు మొదటి బడ్జెట్‌లోనే కేటాయింపులు చేయటం కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధికి నిదర్శనం.

– మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు

బీసీలకు తీరని అన్యాయం

కాంగ్రెస్ చెప్పిన బీసీ డిక్లరేషన్ ఏమైంది..? బీసీ డిక్లరేషన్ అంటే బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష చూపడమేనా? అధికారంలోకి వచ్చాక మొదటి సారి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోనే ఇంత అన్యాయమా..? 15 శాతం ఉన్న ఎస్సీలకు రూ.21 వేల కోట్లు, 10శాతం ఉన్న ఎస్టీలకు రూ. 13వేల కోట్లు.. 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు రూ. 8వేల కోట్లేనా.. ఇదెక్కడి న్యాయం. ఇంత అన్యాయం గతంలో ఎప్పుడైనా జరిగిందా..? ఇది ముమ్మాటికీ వైఫల్యమే.

– ముకుంద్ నాగేశ్వర్, జేఏసీ జిల్లా చైర్మన్

ఈవీఎంల పరిశీలన



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: ఈవీఎంలు, వీవీ ప్యాట్లు పరిశీలన ప్రక్రియ కొనసాగుతున్నట్లు కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఆరు రోజుల నుంచి ఈవీఎంలు 45శాతం, వీవీ ప్యాట్లు 50 శాతం పరిశీలన పూర్తయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు పూర్తి చేయండి

వికారాబాద్ అర్బన్: ఉపాధి హామీ పథకం కింద జిల్లాలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించి 15 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సీసీ రోడ్ల నిర్మాణం, మహాలక్ష్మి పథకం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుపై సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి ఫిబ్రవరి 15 నాటికి పూర్తి చేయాలన్నారు. జెడ్పీ సీఈవో, డీఆర్డీఓ, డీపీఓ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకం కింద రూ. 500కే వంట గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు దొర్లకుండా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, వికారాబాద్, తాండూరు ఆర్డీవోలు విజయకుమారి, శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు తగవు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

- అఖిలపక్షం నాయకులు

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని అఖిలపక్షం నాయకులు అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రఘు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మికులు, కర్షకులను ఇబ్బందులకు గురి చేసే విధంగా చట్టాలు చేస్తోందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేదలపై భారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, సోషలిజం వంటి ప్రాథమిక సూత్రాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని.. ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని.. పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించి, రైల్వే, రక్షణ, విద్యుత్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల్లో కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయాలని, ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులకు యాభై శాతంతో కూడిన కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు. చిన్న, మధ్య తరగతి కుటుంబాలకు రుణభారం నుంచి విముక్తి కల్పించేలా రుణమాఫీ చేయాలని కోరారు. కార్మికులకు నెలకు రూ.26వేల ఇవ్వాలని, వారి భవిష్యత్తుకు పూర్తి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్త కార్మిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పినబాక ప్రభాకర్, జగన్, జంగయ్య, శ్రీను నాయక్, మల్లేష్, శ్రీనివాస్, వెంకటయ్య, లలిత, జంగయ్య, బేరి శ్రీనివాస్, దశరథ్, రాజు, ఈశ్వర్ నాయక్, యాదయ్య, చందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్యాయం చేయాలని చూస్తే

ఊరుకోం

- రాత్రి పూట భూముల పరిశీలనకు రావడం ఏమిటని నిలదీత
- అధికారులను అడ్డుకున్న గిరిజనులు
- కర్రలు పట్టుకొని వాహనాలకు అడ్డుగా నిలబడిన జనం



రాత్రి వేళ గ్రామానికి వచ్చిన రెవెన్యూ అధికారులను నిలదీస్తున్న గిరిజనులు

పరిగి: కోర్టు కేసులో ఉన్న భూములను పరిశీలించేందుకు వచ్చిన రెవెన్యూ అధికారులను శల్మాజాల తండా వాసులు అడ్డుకున్నారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రంగంపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 51,లో 1,620 ఎకరాలు, 62లో 332 ఎకరాల భూమి ఉంది. దశాబ్దాల క్రితం ఈ భూములు అబ్దుల్ వాదూద్ అనే వ్యక్తి పేరిట ఉండేవి. వారి నుంచి సీలింగ్‌కు వెళ్లాయి. ఆ తర్వాత అతని వారసులు వాజిత్ పేరిట 62లో నాలుగు ఎకరాలు, 51లో ఆరు ఎకరాల 11గుంటల భూమి రికార్డులో ఉంది. అయితే దశాబ్దకాలం నుంచి గిరిజనులు మిగిలిన భూముల్లో కాస్తులో ఉన్నారు. ఇటీవల పొజిషన్ ఇప్పించాలని వాజిత్ రెవెన్యూ కోర్టును ఆశ్రయించాడు. శుక్రవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్ ఆనంద్‌రావు, రెవెన్యూ అధికారులు పై సర్వే నంబర్లలోని భూములను పరిశీలించడానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకొని కాస్తులో ఉన్న వారు అక్కడికి చేరుకున్నారు. ఈ సర్వే నంబర్లలో మా భూములు ఉన్నాయని, మీరు ఎందుకు వచ్చారని అధికారులను నిలదీశారు. రాత్రి సమయంలో రావడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాకు అన్యాయం చేసి భూ స్వాములకు కొమ్ము కాసేలా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కర్రలు పట్టుకొని ఆర్డీఓ, తహసీల్దార్ వాహనాలకు అడ్డుగా నిలిచారు. అనంతరం అధికారులు తండా వాసులతో మాట్లాడారు. తాము మీకు ఎందుకు అన్యాయం చేస్తామని, భూముల సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున ఇక్కడికి వచ్చామని సర్ది చెప్పారు. దీంతో గిరిజనులు శాంతించారు. దీనిపై తహసీల్దార్ ఆనంద్‌రావును వివరణ కోరగా సర్వే నంబర్ 51, 62లో తన భూమి లావాణి పట్టగా పడిందని, పట్టగా మార్చాలని వాజిద్ పిటీషన్ వేయడంతో భూముల పరిశీలనకు వచ్చామని తెలిపారు. ఈ భూముల విషయంలో ఎవ్వరికీ అన్యాయం చేయమని, రికార్డు ప్రకారం పనిచేస్తామని తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన

తుర్కయంజాల్: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు ఉషశ్రీ, అనూష తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నం రవాణాశాఖ అధికారి ఎం.రఘునందన్ గౌడ్ ఆదేశాల మేరకు శనివారం సాగర్ రహదారిపై రోడ్డు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

జిల్లాలో నలుగురు తహసీల్దార్ల బదిలీ

ఐదు మంది రాక

అనంతగిరి: రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పలువురు తహసీల్దార్లను శనివారం బదిలీ చేశారు. బదిలీ అయిన వారిలో బషీరాబాద్ తహసీల్దార్ వెంకటస్వామిని సంగారెడ్డి జిల్లాకు, తాండూరు ఆర్డీఓ కార్యాలయం డీఏఓ మహేష్ గౌడ్‌ను నల్గొండ జిల్లాకు, కలెక్టరేట్‌లో ఆయా విభాగాల్లో సూపరింటెండెంట్‌లుగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాస్, ఎండీ నైమత్‌అలీలను నారాయణపేట జిల్లాకు బదిలీ చేశారు. వికారాబాద్ జిల్లాకు ఐదుగురు తహసీల్దార్లు బదిలీపై వచ్చారు. నల్గొండ జిల్లా చౌటుప్పల్ తహసీల్దార్ లావణ్య, సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నఫీస్ ఫాతిమా, సంగారెడ్డి జిల్లా హత్నూర తహసీల్దార్ సంధ్య, నారాయణపేట జిల్లా ఉట్కూరు తహసీల్దార్ శివ శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ తహసీల్దార్ గౌరీ వత్సల వికారాబాద్‌కు బదిలీపై వచ్చారు.

నిధులు రాక.. నిర్వహణ సాగలే

- కళ తప్పిన రైతు వేదికలు
- ఏడాదికి పైగా విడుదల కాని నిర్వహణ నిధులు
- క్షేత్రస్థాయి అధికారులకు ఇబ్బందులు
- రైతులకు అందని సూచనలు, సలహాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



మోమిన్‌పేట్‌లోని రైతు వేదిక

వికారాబాద్ అర్బన్: రైతులను ఒక వేదికపైకి తెచ్చి పంటల సాగులో మెలకువలు, ఆధునిక వ్యవసాయంపై ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖ అధికారులతో సూచనలు సలహాలు ఇచ్చేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు వేదికలు నేడు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ఎంతో గొప్ప లక్ష్యంతో ఏర్పాటు చేసిన రైతు వేదికల నిర్వహణ నిధులను గత ప్రభుత్వం ఆపేసింది. ప్రారంభంలో ఏడాది పాటు సక్రమంగా నిధులు ఇవ్వడంతో అవి రైతులతో కళకళలాడాయి. ఏడాది క్రితం నుంచి రైతు వేదికల నిర్వహణకు నిధులు రావడం లేదు. దీంతో అక్కడ జరగాల్సిన అనేక శిక్షణ కార్యక్రమాలు ఆగిపోయాయి. ప్రస్తుతం అవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

జిల్లా వ్యాప్తంగా 99 రైతు వేదికలు

గత ప్రభుత్వం జిల్లాలో రూ. 21.78 కోట్లు వెచ్చించి 99 రైతు వేదికలు నిర్మించింది. ఒక్కో దాని కోసం రూ. 22 లక్షలు ఖర్చు చేసింది. అయితే ఏడాది నుంచి నిర్వహణ నిధులు విడుదల చేయకపోవడంతో వాటి వైపు సంబంధిత అధికారులు, రైతులు కన్నెత్తి చూడటం లేదు. యాసంగి, వానాకాలం సీజన్లలో తప్ప వాటి నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో రైతు వేదికలను గ్రామ పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేసేవారు. ఇవి గ్రామాలకు దూరంగా ఉండటంతో పారిశుద్ధ్య కార్మికులు రాకపోవడంతో రైతు వేదికలు అపరిశుభ్రంగా మారాయి. రైతుల సంక్షేమం కోసం నిర్మించిన వేదికలను ప్రస్తుతం నిధుల కొరత వెంటాడుతోంది. దీంతో వ్యవసాయ విస్తరణ అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నెలకు రూ. 9 వేలు

ప్రారంభ దశలో రైతు వేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ. 9 వేల చొప్పున నిధులు ఇచ్చింది. ఇందులో పరిశుభ్రతకు రూ. 3వేలు, స్టేషనరీ, జిరాక్స్ రూ. 1000, శిక్షణ ఖర్చులు రూ. 2500, మరమ్మతుల కోసం రూ. 1000, విద్యుత్ చార్జీల కోసం రూ. 1000, తాగునీరు అవసరాలకు రూ. 500 కేటాయించింది. నిధులు వచ్చినన్ని రోజులు నిర్వహణ సవ్యంగా సాగింది. 15 నెలలుగా నిధులు రావడం లేదు.

గ్రామాలకు దూరంగా ఉండటంతో..

కొన్ని గ్రామాల్లో రైతు వేదికలు నివాసాలకు దూరంగా నిర్మించడంతో వాటికి రక్షణ లేకుండా పోయింది. కొన్ని చోట్ల అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో వాటి ఆలనాపాలనా చూసేవారు లేకుండా పోయారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతు వేదికల వద్దకు రావడం మానేశారు. ప్రస్తుత ప్రభుత్వమైనా నిర్వహణ ఖర్చులు మంజూరు చేసి రైతు వేదికలను వినియోగంలోకి తీసుకరావాలని అన్నదాతలు కోరుతున్నారు.

మార్గదర్శకాలు రాలే



ఆధునిక వ్యవసాయంపై శిక్షణ ఇచ్చేందుకు రైతు వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఫీల్డ్ వర్క్‌కు పోయిన ఏఈఓలు మధ్యాహ్నం తరువాత రైతు వేదికల్లో క్లస్టర్ స్థాయి రైతులకు సూచనలు, సలహాలు ఇస్తుంటారు. ఏడాది నుంచి వాటి నిర్వహణకు నిధులు రావడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం రైతు వేదికలపై ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదు.

– గోపాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఎస్పీని కలిసిన టౌన్ సీఐ నాగరాజు

అనంతగిరి: వికారాబాద్ సీఐగా నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన సీఐ శ్రీనును ఐజీ కార్యాలయానికి బదిలీ చేశారు. నాగరాజు జోగిపేట సీఐగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ ఎస్పీ కోటిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అందరి సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

తైక్వాండోలో సత్తా చాటిన గిరి పుత్రిక



బంగారు పతకం అందుకుంటున్న ధనశ్రీ పవార్

బంట్వారం: తైక్వాండో నేషనల్ చాంపియన్‌షిప్–2024 పోటీల్లో గిరి పుత్రిక బంగారు పతకంతో మెరిసింది. బంట్వారం మండలం నాగవరం తండాకు చెందిన ధనశ్రీ పవార్ పుణేలో 9వ తరగతి చదువుతుంది. వీరి కుటుంబం ఉద్యోగ రీత్యా అక్కడే స్థిర పడ్డారు. ఇటీవల రాజస్తాన్‌లోని జైపూర్‌లో నిర్వహించిన క్యాడెట్ సెకెండ్ సబ్ జూనియర్ నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ అండర్–16లో 59 కేజీల విభాగంలో గెలిచి ఇంటర్ నేషనల్ పోటీలకు ఎంపికైంది. ఈ క్రమంలో రెండు రోజుల కిందట జైపూర్‌లో ఇండియా తైక్వాండో ప్రెసిడెంట్ నామ్‌దేవ్ చేతుల మీదుగా ధనశ్రీ పవార్ బంగారు పతకం అందుకుంది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు శంకర్ పవార్, మనీషతో పాటు తండా వాసులు ధనశ్రీ పవార్‌ను అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పూడూరు: పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసిన సంఘటన చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చన్గోముల్ ఎస్‌ఐ మధుసుదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాకంచర్ల శివారులో శనివారం కొందరు పేకాట ఆడుతుండగా దాడి చేశారు. అయిదుగురిని అదుపులోకి తీసుకుని 1,300 నగదును స్వాధీనం చేసుకున్నారు.

రెండు బైక్‌లు ఢీ, వ్యక్తి మృతి



బాలకృష్ణ (ఫైల్)

కుల్కచర్ల: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన బాలకృష్ణ, కుల్కచర్ల నుంచి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో.. రాంనగర్‌కు చెందిన గోపాల్ కుల్కచర్లకు వస్తుండగా పాంబండ దేవాలయంలో సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలకృష్ణ మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు.

భగీరథ.. బడికి వ్యథ!

- విద్యార్థులకు తాగునీటి తిప్పలు
- ఇంటి నుంచే తెచ్చుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రతి పల్లెకు తాగునీటిని అందించాలన్న సంకల్పంతో మిషన్ భగీరథ పథకాన్ని ప్రారంభించినా కొన్ని ప్రాంతాలకు చేరకపోవడం గమనార్హం. భగీరథ అందని ద్రాక్షలా మారుతున్న పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ప్రభుత్వ పరిధిలోని పాఠశాలలకు తాగునీటి సౌకర్యం లేక గ్రామీణ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.



మధ్యాహ్న భోజన సమయంలో వాటర్ బాటిళ్లు పెట్టుకున్న విద్యార్థులు

కుల్కచర్ల: ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ నీటిని అందించాలని గత ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. కానీ, కొన్ని చోట్ల మాత్రం కాగితాలకు మాత్రమే పరిమితమైంది. అత్యవసరమైన కొన్ని ప్రాంతాలకు తాగునీటిని అందించాల్సిన అవసరం ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కులకచర్ల మండలంలో మిషన్ భగీరథ నీరు అందక విద్యార్థులు తమ ఇళ్ల నుంచే నీళ్ల సీసాలను తెచ్చుకుంటున్న పరిస్థితి నెలకొంది. మండల పరిధిలో 98 పాఠశాలలు ఉండగా 50 పాఠశాలలలో మాత్రమే మిషన్ భగీరథ నీరు అందుతుంది. మిగతా పాఠశాలలలో స్థానికంగా బోర్ల ద్వారా నీటిని వినియోగిస్తున్న దుస్థితి నెలకొంది. దీంతో గొంతు తడుపుకోవడానికి తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

గుక్కెడు నీటికి ఆపసోపాలు

కొన్ని పాఠశాలలకు కనీసం మిషన్ భగీరథ పైపులైన్‌కు నల్లాలు ఏర్పాటు చేయని ఉదంతాలు ఉన్నాయి. వాటిలో నాగమ్మగడ్డ తండా, అల్లాపూర్, దాస్యనాయక్ తండా, చెరువుముందలి తండా(ఎ), కుస్మసముద్రం ప్రాథమిక పాఠశాల, మంచికుంట తండా, సాల్వీడు, టాక్యానాయక్ తండా పాఠశాలలు నిలిచాయి. తాగడానికి అందుబాటులో నీరు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో గత్యంతరం లేక ఇంటి నుంచే నీటిని తెచ్చుకుంటున్నారు. కొన్ని సర్కారు బళ్లకు పైప్‌లైన్‌లు మొదట్లో వేసినా తర్వాత వాటిని అక్కడి నుంచి తరలించి తిరిగి వేయకుండా నిర్లక్ష్యం చేశారు. ఇలా మండలంలో 20కిపైనే పాఠశాలలు ఉన్నాయి. ముఖ్యంగా అంతిగానికుంట, బండమీది తండా, బొయకోటలు, దీప్లానాయక్ తండా, ఘండిచెరువు, గోప్యానాయక్ తండా, కిచ్చన్నకుంట తండా, ముజాహిద్‌పూర్ ప్రాథమిక పాఠశాల, నేరళ్లకుంట తండా, పోటిగడ్డ తండా తదితర పాఠశాలలకు కనీసం పైప్‌లైన్ లేకపోవడంతో బాటిళ్లతో గొంతును తడుపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సర్కారు బడిలో స్వచ్ఛమైన తాగునీరు లేక విద్యార్థులు గుక్కెడు నీటికి ఆపసోపాలు పడుతున్నారు.



పైప్‌లైన్ కనెక్షన్ లేని గోప్యానాయక్ తండా పాఠశాల

ఇంటి నుంచి తెచ్చుకుంటున్నాం



పాఠశాలలో మిషన్ భగీరథ నీరు అందుబాటులో లేకపోవడంతో తామందరం ఇంటి నుంచి మంచి నీటిని తెచ్చుకుంటున్నాం. మధ్యాహ్నం వరకు అయిపోతే మళ్లీ ఇంటికి వెళ్లి నీరును బాటిళ్లలో నింపుకొని వస్తున్నాం. అన్నం తినేటప్పుడు ఇబ్బంది అవుతోంది.

– అభినవ్, 5వ తరగతి, సాల్వీడు ప్రాథమిక పాఠశాల

ఇబ్బందులు లేకుండా చూస్తాం



ప్రస్తుతం కొన్ని పాఠశాలలకు మిషన్ భగీరథ పైప్‌లైన్ లేదు. వాటి గురించి జిల్లా అధికారులకు తెలియజేశాం. ప్రత్యేకాధికారులుగా జిల్లా అధికారులు ఉన్న నేపథ్యంలో సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తాం.

– హబీబ్ అహ్మద్, ఎంఈఓ, కుల్కచర్ల

ఉదయమే నీటి సరఫరా

చౌడాపూర్ మండల పరిధిలోని మరికల్ క్లస్టర్ పరిధిలో మిషన్ భగీరథ వాటర్ ఉదయం 6 నుంచి 7:30 వరకు వస్తుంది. అనంతరం నీటి సరఫరా నిలిచిపోతుంది. కానీ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఉదయం 9 గంటల అనంతరమే బడికి వస్తుంటారు. దీంతో నీరు నిల్వ చేసుకొనే సౌకర్యాలు లేక అవసరాలకు నీరు అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం పూట నీటి సరఫరాతో పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు అసౌకర్యంగా భావిస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ధారూరు: ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టేషన్ ధారూరుకు చెందిన ఆటో డ్రైవర్ ఎం.డి.హమీద్‌ఖాన్‌కు ముగ్గురు పిల్లలు. పెద్ద కుమారుడైన అమేర్‌ఖాన్(21) ఆటో నడిపిస్తూ జీవించేవారు. ఈ నెల 9న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. చికిత్స నిమిత్తం వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితిని విషమించడంతో నిమ్స్‌కి రిఫర్ చేశారు. అక్కడే చికిత్స పొందుతున్న అమేర్‌ఖాన్ శుక్రవారం రాత్రి మరణించారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మోమిన్‌పేట: ఆటో బైక్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మోమిన్‌పేటలో శనివారం మధ్యాహ్నం చోటు చేసుకొంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన బావోజి ప్రభాకర్‌రెడ్డి బైక్‌పై మోమిన్‌పేటకు వస్తున్నారు. అదే సమయంలో సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలానికి చెందిన చంద్రశేఖర్‌గౌడ్ ఆటోలో వికారాబాద్ వైపు వెళ్తుండగా కార్తికేయ ఫ్యాక్టరీ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ప్రభాకర్‌రెడ్డికి తలపై తీవ్ర గాయాలయ్యాయి. 108వాహనంలో సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు మార్గాగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

గురుకుల విద్యార్థులకు అస్వస్థత

కొత్తగడి రెసిడెన్షియల్‌లో పలువురికి జ్వర లక్షణాలు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తగడిలో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో అపరిశుభ్రతతో పలువురు విద్యార్థినీలు అస్వస్థతకు గురయ్యారు. ఈ పాఠశాలలో దాదాపు 500 మంది విద్యార్థినీలు చదువుకుంటున్నారు. ఈ నెల 1 నుంచి విద్యార్థినులు అస్వస్థతకు గురికావడంతో 2న ప్రిన్సిపాల్ అపర్ణ వైద్య అధికారులకు సమాచారం అందించారు. డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్ వైద్య బృందాన్ని పంపించి మెడికల్ క్యాంపు నిర్వహించారు. రక్త నమునాలు సేకరించగా 40 మంది వరకు విద్యార్థినీలకు పచ్చకామెర్ల లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. చాలా మందికి స్వల్పంగా ఉన్నట్లు తేల్చారు. మిగితా కొంత మంది విద్యార్థులకు ఫీవర్ ఉన్నట్లు గుర్తించి చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల వెంట ఇంటి దారి పట్టారు. అక్కడ ఉంటే అనారోగ్యం చెందుతారని ఇళ్లకు వెళుతున్నారు. అస్వస్థతకు పాఠశాల ఆవరణలో అపరిశుభ్రతే కారణమని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణను వివరణ కోరగా.. విద్యార్థులు అస్వస్థతకు గురైన మాట వాస్తవమేనని, వెంటనే డీఎంహెచ్‌ఓకు సమాచారం ఇవ్వగా వైద్య బృందంతో క్యాంపు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్‌ను వివరణ కోరగా.. విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే సమాచారం ఇవ్వడంతో మా సిబ్బంది గత వారం రోజులుగా అక్కడే క్యాంపు నిర్వహించారన్నారు.

ఫోర్జరీ చేసి.. ప్లాట్లు విక్రయించి

- తప్పించుకు తిరుగుతున్న నిందితులు
- ఒకరి అరెస్టు రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ఉద్యోగం చేస్తున్న సంస్థను మోసం చేశారు.. ఫోర్జరీ సంతకాలతో ప్లాట్లను విక్రయించారు.. ఐదేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని సాంకేతిక ఆధారాలతో చాకచక్యంగా అరెస్టు చేశారు. విచారణ అనంతరం నిందితుడి రిమాండ్‌కు తరలించారు. శనివారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ బంజారాహిల్స్, ఎమ్మెల్యే కాలనీలో నివాసం ఉంటున్న రోజారమణి, ఆమె కూతురు కావ్య మేరీ సువర్ణ భూమి రిసార్ట్స్(ఎంఎస్ఆర్) హౌసింగ్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థకు రోజారమణి చైర్మన్‌గా, కావ్య మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అదే సంస్థలో మంచాల సాయిసుధాకర్ డైరెక్టర్‌గా, కల్యాణ చక్రవర్తి మేనేజర్‌గా పని చేస్తున్నారు. కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామశివారులో కొంత భూమిని తీసుకొని ప్లాట్లుగా చేసి మేరీ ఆ సంస్థ పేరిట అమ్ముతున్నారు.

సంస్థను మోసగించి

మేరీ సువర్ణభూమి రిసార్ట్స్(ఎంఎస్ఆర్) హౌసింగ్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పని చేస్తున్న డైరెక్టర్ మంచాల సాయిసుధాకర్ ఫోర్జరీ, ఛీటింగ్ చేసి కంపెనీకి చెందిన నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణల నేపథ్యంలో సంస్థకు రాజీనామా చేశారు.

రూ.2 కోట్లకు ఎసరు

నిందితులు మంచాలసాయిసుధాకర్, కల్యాణచక్రవర్తి సంతకాలను ఫోర్జరీ చేసి ప్లాట్లను విక్రయించారు. 2017లో నకిలీ సంతకాలతో సుమారు రూ.2 కోట్ల విలువచేసే 6 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై రోజారమణి, కావ్య షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయస్థానం ఫోరెన్సిక్ ల్యాబ్ పంపగా సంతకాలు ఫోర్జరీ అయినట్లు నిర్ధారణ చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు 2021లో మంచాలసాయిసుధాకర్‌ను అరెస్టు చేశారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు.

ఐదేళ్లుగా పరారీలో

డీసీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో ప్రత్యేక బృందంతో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఐదేళ్లుగా తప్పించుకొని తిరుగుతున్న నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తును ముమ్మరం చేశారు. కల్యాణచక్రవర్తిని ఈ నెల 9న విజయవాడలో అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం ఆయనని రిమాండ్‌కు తరలించారు. నిందితులపై బంజారాహిల్స్, సీసీఎస్ హైదరాబాద్, షాద్‌నగర్, కొత్తూరు, సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లలో 8 కేసులు నమోదైనట్లు తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. చక్రవర్తిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ ప్రతాప్‌లింగం, ఎస్‌ఐ శరత్ కుమార్, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

భూముల కోసం అన్వేషణ?

- పరిశ్రమల ఏర్పాటుకు రహస్య సర్వే
- ఒకేచోట వెయ్యి ఎకరాలు గుర్తించేందుకు కొనసాగుతున్న పనులు
- పాత బొంరాస్‌పేట మండల పరిధిలో పర్యటిస్తున్న ప్రత్యేక బృందాలు



ఉమ్మడి బొంరాస్‌పేట మండల పరిధిలో సర్వే చేస్తున్న అధికారులు

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్ అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. పాత (ఉమ్మడి) బొంరాస్‌పేట మండల పరిధిలో ఏర్పాటు చేయనున్న పరిశ్రమల కోసం ఒకే చోట వెయ్యి ఎకరాల భూమిని గుర్తించేందుకు సర్వే కొనసాగుతోంది. ఈ విషయమై స్థానిక అధికారులకు సైతం సరైన సమాచారం లేదని తెలుస్తోంది. ప్రత్యేక రెవెన్యూ బృందాల ద్వారా రహస్య సర్వే కొనసాగుతోందని సమాచారం. క్షేత్రస్థాయిలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఈ విషయాలను ధ్రువీకరిస్తున్నారు. తమ సమీప పొలాల్లో కొంతమంది సర్వే నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. ఏం జరుగుతోందని రైతులు ఆరా తీసినా.. సర్వే చేస్తున్నామని చెబుతున్నారు తప్ప వివరాలేవీ వెల్లడించడం లేదని పేర్కొంటున్నారు. కొడంగల్ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకోసం వికారాబాద్, నారాయణపేట కలెక్టర్లు నారాయణరెడ్డి, శ్రీహర్షకు బాధ్యతలు అప్పగించారని సమాచారం. ఇందులో భాగంగా అన్ని మండలాల్లో సర్వే నంబర్ల ఆధారంగా అన్వేషణ మొదలైందని వినికిడి. ఇందుకోసం రెవెన్యూలో ప్రత్యేక విభాగమే పనిచేస్తోందని సమాచారం. ప్రభుత్వ, పట్టా భూములు కలిపి ఒకే చోట వెయ్యి ఎకరాలు కావాలని ఫార్మా కంపెనీలు అడిగినట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు కింది స్థాయి ఉద్యోగులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ఎక్కువగా ప్రభుత్వ భూములుండి చుట్టుపక్కల ఉన్న పట్టా భూములను కొనుగోలు చేసి.. ఒకే చోట వెయ్యి ఎకరాలు సేకరించనున్నట్లు తెలుస్తోంది. కానీ ఈ విషయాన్ని అధికారులెవరూ ధ్రువీకరించడం లేదు.

ప్రజారంజక బడ్జెట్

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి



పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి

ధారూరు: తెలంగాణ అసెంబ్లీలో శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజకంగా ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సకల జనుల సంక్షేమ బడ్జెట్‌ను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ప్రవేశ పెట్టినట్లు ఆయన చెప్పారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను పక్కా అమలు చేస్తామని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

భగీరథ పైపులు.. పక్క దారి



డీసీఎంలో తరలిస్తున్న మిషన్ భగీరథ పైపుల శిథిలాలు

చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

పరిగి: మిషన్ భగీరథ పైపులను ఫ్యాక్టరీలకు తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. భగీరథ సామగ్రి, పైపులను ఓ వాహనంలో శనివారం తరలిస్తుండగా స్థానికులు పట్టుకుని భగీరథ అధికారులకు సమాచారం అందించి పరిగి పోలీసులకు అప్పగించారు. అధికారులు పరిశీలించి భగీరథ పైపులే అని నిర్ధారించారు. వివరాలపై ఆరా తీయగా మర్పల్లి నుంచి తీసుకువస్తున్నట్లు డీసీఎం డ్రైవర్ చెప్పారు. పట్టుకున్న సామగ్రిని, డీసీఎంను అధికారులు డబ్బులు తీసుకుని వదిలేశారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇలా నిత్యం ప్రభుత్వ శాఖలకు చెందిన ఇనుప పైపులను అక్రమంగా స్టీల్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రికార్డులు సృష్టించి.. సొమ్ము కాజేసి!

- ఉపాధి పనుల్లో గోల్‌మాల్
- అక్రమాలపై అధికారుల గరం
- ఈజీఎస్ సిబ్బంది నుంచి రూ.16 లక్షల రికవరీకి ఆదేశాలు



ఫిర్యాదు చేస్తున్న కూలీలు

కొడంగల్: ఉపాధి హామీ పథకం అక్రమార్జనకు దిక్సూచిగా మారింది. రాసిందే శాసనం.. చెప్పిందే వేదం అన్న రీతిలో గ్రామస్థాయి సిబ్బంది చేతివాటం చూపిస్తున్నారు. మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీల్లో గతేడాది జరిగిన ఉపాధి హామీ పనుల్లో రూ.15,91,302 అవినీతి జరిగినట్లు అధికారికంగా బహిర్గతమైంది. ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంటు, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయాలని ఏపీడీ సరళ, అంబుడ్స్‌మెన్ రాములు, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ భార్గవి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం రాత్రి వరకు కొడంగల్ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. అన్ని గ్రామా ల్లో జరిగిన ఉపాధి పనుల అక్రమాలపై కూలీలు, ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. విచారించిన అధికారులు అక్రమాలు నిజమని తేల్చారు. పనుల్లో అవినీతితో పాటు తప్పిదాలు చేసినందుకు మరో రూ.31 వేలు జరిమానా విధించారు.

ఇష్టారాజ్యం

ఉపాధి హామీ పథకంలో భాగంగా 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు మండలంలోని 26 పంచాయతీల్లో రూ.7.11 కోట్లు వెచ్చించి 1,011 పనులు చేసినట్లు రికార్డు చేశారు. ఈ పనులపై సామాజిక బృందాల సభ్యులు గ్రామాల్లో పర్యటించి విచారణ చేశారు. చేయని పనులకు బిల్లులు చెల్లించినట్లు చనిపోయిన కూలీల పేరు మీద పనులు చేసినట్లు మట్టి కొట్టకుండానే బిల్లులు ఇచ్చినట్లు అధికారులు నిర్ధారించారు. హరితహారం పథకంలో మొక్కలు నాటకుండానే బిల్లుల చెల్లించారని, సర్వే నంబర్ పట్టాదారు పాసుపుస్తకాలు లేకుండానే పనులు చేసినట్లు రికార్డు చేసి అవినీతికి పాల్పడినట్లు అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో ఈజీఎస్ సిబ్బంది నుంచి రూ.15,91,302 రికవరీ చేయాలని తప్పిదాలకు రూ.31వేలు వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

మరో పనులపై విచారణ

అలాగే రూ.3,37,295 పనులపై ఎంపీడీఓ, క్వాలిటీ కంట్రోల్ అధికారులతో విచారణ చేయించాలని నిర్ణయించారు. ఇందనూర్‌లో ఎవెన్యూ ప్లాంటేషన్, ఖాజా అహ్మద్‌పల్లిలో రూ.47,444 పనులపై ఎంపీడీఓ విచారణ, హస్నాబాద్‌లో రూ.1,12,115 పనులపై, పల్గుర్లాళ్ల తండాలో రూ.1,77,736 పనులపై క్వాలిటీ కంట్రోల్ విచారణకు ఆదేశించారు.

అత్యధికంగా

మండలంలో అత్యధికంగా చిన్ననందిగామ సిబ్బంది నుంచి రూ.3,34,683, పోచమ్మ తండా నుంచి రూ.2,33,503, లక్ష రూపాయలకు పైగా రికవరీ ఉన్న గ్రామాలు చిట్లపల్లి సంగాయిపల్లి, లక్ష్మీపల్లి, ఖాజా అహ్మద్‌పల్లి, ఉడిమేశ్వరం గ్రామాలు ఉన్నాయి.

బుక్ కీపర్‌పై చర్యలేవి?

- సస్పెన్షన్ గురైనా తొలగించని వైనం
- ఏపీఎం తీరుపై మహిళా సంఘాల ఆగ్రహం

దోమ: మహిళా సంఘానికి రుణాలు ఇప్పించడంలో బుక్ కీపర్ చేతివాటం ప్రదర్శించిన విషయంలో జిల్లా అధికారులు సస్పెన్షన్‌కు గురి చేసినా.. సంబంధిత మండల స్థాయి అధికారి మాత్రం ఆయన్ని తొలగించలేదు. ఈ సంఘటన దోమ మండలంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మోత్కూర్ గ్రామానికి చెందిన కటిక మల్లేశం గ్రామంలో బుక్ కీపర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే శివశ్రీ మహిళా సంఘానికి సంబంధించి 2022 ఆగష్టు 30న రూ.7.50 లక్షల రుణం మంజూరైంది. ఆ రుణాన్ని ఇప్పించేందుకు గ్రామ సంఘం సహాయకుడిగా మహిళా సంఘం సభ్యులను తీసుకెళ్లి ఇప్పించేందుకు బ్యాంకుకు వెళ్లాడు. అందులో సంఘ సభ్యులకు రూ.5 లక్షలు ఇప్పించి మిగతా రూ.2.50 లక్షలు బ్యాంకులో ఉంటాయని మహిళలను మభ్యపెట్టాడు. ఈ విషయంపై మహిళా సంఘాల సభ్యులకు అనుమానం రాగా, బ్యాంకుకు వెళ్లి స్టేట్‌మెంట్ తీయించారు. రూ.2.50 లక్షలు అతని భార్య అకౌంట్‌లోకి వెళ్లినట్లు మహిళా సంఘాల సభ్యులు గుర్తించారు. వెంటనే ఏపీఎంకు వినతి పత్రం ఇవ్వగా విచారణ చేపట్టి ఉన్నతాధికారులను నివేదికను అందజేశారు. ఉన్నతాధికారులు అతన్ని ఈ నెల 3వ తేదీన సస్పెన్షన్ వేటు వేయగా, మండల ఏపీఎం మాత్రం అతన్ని తొలగించలేదని మహిళా సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో ఏపీఎం పనితీరుపై మహిళా సంఘాల సభ్యులు ఆగ్రహానికి గురవుతున్నారు. సస్పెన్షన్‌కు గురైన బుక్ కీపర్ మహిళా సంఘాలకు సంబంధించిన బుక్స్ అతని దగ్గరే ఉంచుకొని ఇబ్బందులకు గురి చేస్తున్నారని సభ్యులు మండి పడుతున్నారు. ఈ విషయంపై ఏపీఎం సురేశ్‌ను వివరణ కోరగా.. ఉన్నతాధికారులు అతన్ని సస్పెన్షన్‌కు గురి చేసిన విషయం వాస్తవమే. సస్పెన్షన్ సంబంధించిన ఆర్డర్ కాపీ రాగానే అతన్ని విధుల నుంచి తొలగించాం. విధులకు రావొద్దని సూచించాం. బుక్స్ ఇవ్వని విషయం తమ దృష్టికి రాలేదు. ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటాం.